ఊరుకు అసలు అర్థం.. కుబేరపురం. ధనదుడు అంటే కుబేరుడు. ధనవంతుల ఊరు కాబట్టి ధనదుపురం అన్నారు. మరోవిశేషం ఏమిటంటే.. నిజంగానే కుబే రుడు అనే మహారాజు ఈ ప్రాంతాన్ని పరిపాలించాడు.

ప్రస్తుత పాలక కుటుంబమైన అయ్యవంశంవారి మరో వారసుడు జాయప సేనాపతి ఇప్పుడు వెలనాడు మండలేశ్వరుడు కాబోతున్నాడు.

పినచోడుడు పరమపదించాక ఆయన పెద్ద కొడుకు పృథ్వీశ్వరచోడుడు పరిపాలనకు రాగా.. ఇప్పుడు హఠా త్తుగా ఆయన రెండవ కుమారుడు జాయపచోడుణ్ని వెలనాడు మండలేశ్వరునిగా పంపించాడు చక్రవర్తి గణ పతిదేవుడు. యుద్ధవీరుడుగా, నాట్యాచారుడిగా పేరొం దిన జాయపుడు తమవాడుగా తమ రాజ్యానికే మండ లేశ్వరుడిగా రావడం.. వెలనాడు ప్రజలకు మరింత ఆనందంగా ఉంది.

ఆరోజు ఆయన సింహాసనం అధిష్ఠించబోతున్న రోజు.. తండోపతండాలుగా తరలివచ్చిన ప్రజలతో ధన దప్రోలుకోట రాజనగరులో సమావేశ మందిరం కిటకి టలాడుతున్నది.

జాయపుడు తలగడదీవిలో పుట్టినా ఎక్కువకాలం అనుమకొండలో పెరగడంవల్ల.. బాలుడిగా కూడా చూడని ఇప్పటి మహామంత్రులు, సేనానులు, నియోగా ధిపతులు, భటులు, పరిచారికలు సైతం ఎప్పుడెప్పుడు ఆయనను చూద్దామా అని ఉవ్విళ్లూరుతున్నారు.

''అక్కల కోసం.. చెప్పాపెట్టకుండా ఏదో గూడు బండి ఎక్కి అనుమకొండ వెళ్లిపోయాడట!''.

''అక్కడ వీధుల్లో బిచ్చమెత్తుకున్నాడట!''.

''ఛ ఛ.. తప్పు! చక్రవర్తే నాట్యం నేర్పించాడట. అంటే చక్రవర్తి చేరదీసినట్లే కదా!''.

''అది తర్వాత. ముందు ఆయనను చేరదీసింది ఆస్థాన వేశ్య, మహాకళాకారిణి నీలాంబిక. ఆమెను ఈయనగారు 'అక్కా' అని పిలుస్తాడు. అబ్బ.. ఆయన నాట్యం చేస్తుంటే చూడాలి.. అదిరిపోతుందట!''.

''నాట్యం సంగతేమో గానీ గొప్ప యుద్ధవీరుడట. యుద్ధభూమిలో కత్తివేటుకు నలుగుర్ని నరకగలడట!''.

''గుర్రాలు, ఏనుగులు ఆయన చెప్పినట్లు చేస్తా యట. యోజనాల దూరం నుంచి సంజ్ఞ చేస్తే శత్రువును తొక్కి తొక్కి చంపేస్తాయట!''.

''ఏమా ప్రతిభ.. అలాంటివాడు మన మహారా జంటే.. తిప్పరా మీసం''.

''మనదృష్టం. ఇటు కత్తి తిప్పడంలో అటు కాలుకద పడంలో.. రెండిటిలో గొప్పోడు అంటే చరిత్రలో చాలా గొప్పోడన్న మాట!''.

''నిజమే.. ఇట్టాంటోడు మనకు తెలినంతవరకూ మరొకడు లేడు. అది మన అదృష్టం''.

ప్రజలు గుసగుసలాడుతుండగా మందిరంలోకి ప్రవే శించాడు జాయపుడు.

నిలువెత్తు అందానికి ప్రతిరూపమైన జాయపుడు.. చీనీ ఎర్రపట్టు ధోవతి కట్టి, ముందు వెనకా కుచ్చుళ్లు పోసి పచ్చని అంచులుతీసి బయటికి కనిపించేలా పైకి లాగి నడుము వద్ద దోపాడు. పసిడి ఉత్తరీయం నడు ముకు చుట్టి దానిపై రత్నాలు పొదిగిన బంగారు మొల తాడు.. దానిలో పచ్చల పిడిబాకు, పక్కగా పొడవుగా వేలాడుతున్న బంగారు ఒరతో ఖడ్గం.. పైన నీలపు కంచుకం.. ఆపైన రంగురంగుల తలపాగాతో వినయ వంతుడైన మహాయోధుడిలా భాసిల్లాడు.

అక్షతలు చేతపట్టి వేదమంత్రాలు పఠిస్తున్న పండితో త్తములు, సంప్రదాయ ఛత్ర, కేతన, చామరాలు అలం కరిస్తున్న మంత్రివర్యులు, వింజామరలు పట్టుకున్న పరిచారికలు, అడపంధారి, మండలేశ్వరుని ఆంతరం గిక నిర్వహణాధికారి.. అందరూ కళ్లు విప్పార్చి ఆ సుందర దృశ్యాన్ని కళ్లలో నింపుకొంటున్నారు.

వందిమాగధులు వినసొంపుగా స్తోత్ర వర్ణనలు చేశారు.

''కాకతీయసామంత వెలనాడు మండలేశ్వరా.. జాయప చోడా జయహో..

జయ జయ జయ జయహో..

జయ జయ జయ జయహో!!''..

సమస్త ఆహూతులు అక్షతలతో.. 'దీర్ఘాయుష్మాన్ భవ' అని ఆశీర్వదించారు.

పట్టాభిషేక క్రతువు పూర్తయ్యాక బాబయగారు బ్రహ్మయ్యను, అన్న పృథ్వీశ్వరుణ్ని చెరో పక్కకు పిలిచి.. భుజాలపై చేతులుంచి చెప్పాడు కొత్త మండలే శ్వరుడు జాయపచోడుడు.

''నా వెలనాడు ప్రజలకు నమస్కారం!

మహోన్నత కాకతీయ సామ్రాజ్యంలో భాగమైన వెలనాడు సీమకు మండలేశ్వరుడిగా నేను ప్రమాణం చేశాను. మహామనిషి, మహామండలేశ్వరులు శ్రీశ్రీశ్రీ గణపతిదేవులవారి మాటపై నేనీ పదవిని అధిష్ఠించాను. నిజానికి నాలుగుతరాలుగా మా అయ్యవంశంవారు ద్వీపసీమను పరిపాలిస్తున్నారు. వెలనాడును జయిం చిన చక్రవర్తి దయతో మా తండ్రిగారిని వెలనాడుకు సామంత ప్రభువుగా నియమించారు. నేడు నన్ను ఆ బాధ్యతలు తీసుకోమన్నారు. అంతా వారి ఆజ్ఞ. కాదు అనే సాహసం నాకులేదు. కారణం నా జీవితం వారికి అంకితం. అయితే ఇక్కడ నేనున్నా, అన్న ఉన్నా, బాబ యగారున్నా ఒక్కటే. పాలన వారే ఎప్పటిలాగే నిర్వహి స్తారు. అందరూ తమ తమ సమస్యలు చెప్పుకోవచ్చు. మనపై ఎవ్వరూ చిన్న మట్టిగెడ్డ కూడా విసరలేరు. రక్షణ నా బాధ్యత. సుఖవంతమైన జీవితం, సంపద పెంచడం మీ బాధ్యత. అందుకు సదా ఆ రుద్రేశ్వరుడు మనల్ని కాపాడుతుంటాడు. నా సింహాసనాధిష్ఠ మహో త్సవం సందర్భంగా వృత్తి కాణికలను, గుడ్డేగు మాడ లను, పుట్టి హండి, పుట్టి కొలువు, ఉపకృతి, పశువుల పుల్లరి రద్దు చేస్తున్నాను!''..

పట్టాభిషేకం సమయాన తప్ప మరెప్పుడూ జాయ పుడు ఆ సింహాసనంలో కూర్చోలేదు.

* * *

మంచికో చెడుకో తగిన సమయంలోనే చక్రవర్తి కొత్త బాధ్యతలు జాయపుని నెత్తిన పెట్టాడు. అనుమకొం డలో వీడ్కోలు తీసుకుంటూ అంతఃపురం వెళ్లాడు జాయపుడు. నారాంబ కన్నీరుమున్నీరయ్యింది. తమ్ముణ్ని ఆర్తిగా అల్లుకుంది.

''తమ్ముడు మండలేశ్వరుడైనందుకు సంతోషిం చాలో.. నాకున్న ఒకే ఒక్క తోడు దూరం అవుతున్నం దుకు బాధపడాలో తెలియడంలేదు..''

**నిజానికి వాళ్లిద్దరూ తనను ఆజ్ఞాపించి పెళ్లి చెయ్యగల అధికారం ఉన్నవాళ్లే. కానీ, తడుముకుంటూ మాటలు కలుపుకొంటూ వాక్యాలు పూర్తిచేయడం.. ముఖ్యంగా చక్రవర్తి అలా అభ్యర్థిస్తున్నట్లు మాట్లాడటం.. కదిలిపోయాడు జాయపుడు.. ఏమి చెప్పాలి.. లోలోపలి సంఘర్షణ జ్వలించి జ్వలించి కొంత స్థిరత్వాన్ని పొందింది.**

అక్క, మేనల్లుళ్లపై కుట్రలు జరుగుతున్న సమ యంలో వాళ్లకు దూరం కావాల్సిరావడం.. జాయ పుణ్ని కొంత విచికిత్సకు లోను చేసింది. ఆ భయాన్ని తొలగిస్తూ అభయమిచ్చాడు గణపతిదేవుడు.

''నీ అక్కకు, నీ మేనల్లుళ్లకు వచ్చిన బాధలేమీలేవు. పట్టమహిషి తత్వం తెలిసినవాడిగా ఇద్దరి మధ్య అడ్డ గోడలు కట్టించాం. మళ్లీ కొన్నాళ్ల తర్వాత ఆ గోడలు మేమే తొలగించాం. తప్పుచేశామా.. లేదు. తత్వాలు బయటపడతాయి. సంఘర్షిస్తాయి. రానురానూ సర్దు కుంటాయి. ఇద్దరూ ఒకటవుతారు. చూస్తుండు!''.

అక్కాపిల్లలను ఆయన కంటే తను బాగా చూసుకోగ లడా.. లేదు కాక లేదు.

ఆయన దూరదృష్టిని గుర్తించి మనసు ఆహ్లాదప డింది. వంగి ఇద్దరి కాళ్లకూ నమస్కరించాడు.

ఇద్దరూ కాస్త తటపటాయించి.. ఇబ్బందిగా కద లడం జాయపుడు గుర్తించాడు.

''అక్కా.. ఏమిటి? చెప్పు.. ఏమైనా చెప్పాలని.. చెప్పలేక!''..

గణపతిదేవుడు ముందుగా ప్రస్తావనగా అన్నాడు.

''అదే.. నీ వివాహం. నీకొక కుటుంబం ఏర్పడితే బావుంటుందని మేమిద్దరం ఆశ పడుతున్నాం జాయా.. మీ అక్క ఈ విషయమై తీవ్ర వ్యధ చెందుతున్నది..''

''అవునా.. జాయా! నువ్వొక ఇంటివాడివైతే మాకు కాస్త అలజడి తగ్గుతుంది''.

నిజానికి వాళ్లిద్దరూ తనను ఆజ్ఞాపించి పెళ్లి చెయ్య గల అధికారం ఉన్నవాళ్లే. కానీ, తడుముకుంటూ మాటలు కలుపుకొంటూ వాక్యాలు పూర్తిచేయడం.. ముఖ్యంగా చక్రవర్తి అలా అభ్యర్థిస్తున్నట్లు మాట్లాడటం..

కదిలిపోయాడు జాయపుడు..

ఏమి చెప్పాలి.. లోలోపలి సంఘర్షణ జ్వలించి జ్వలించి కొంత స్థిరత్వాన్ని పొందింది.

''ప్చ్.. మీకు ఇలా జవాబు ఇవ్వాల్సిన సమయం వస్తుందని అనుకోలేదు బావగారూ. నేనొక అమ్మా యిని.. ఓ గ్రామీణ యువతిని ఇష్టపడ్డాను. నిజానికి ఇద్దరం ఏకమయ్యాం.. మానసికంగా శారీరకంగా. కానీ కానీ ఆమె నన్నొక దురూహతో వదిలి మాయమైంది. నేనెంత సతమతమయ్యానో.. నన్ను మళ్లీ మనిషిని చెయ్యడానికి మీరెంత సతమతమయ్యారో అందరికీ తెలుసు. ఆమె.. ఆమె భావనలు.. అనునిత్యమూ నన్ను వదలడంలేదు. ఆమె నాలోనే నాతోనే ఉన్నట్లు.. దగ్గ రగా.. కాస్త దూరంగా.. కనిపించి కనిపించకుండా నేనే తన ప్రాణంగా తిరుగాడుతున్నది. అందువల్ల నేను మరో స్త్రీని భార్యగా స్వీకరించలేను. ఏదోనాటికి ఆమె నన్ను చేరుతుంది. అప్పటివరకు నేను నిరీక్షించాల్సిందే!''..

ఇద్దరూ నిరుత్తరులయ్యారు.

''మీరిద్దరూ నాకు దేవతలు. నా పెళ్లి ప్రసక్తి మళ్లీ నావద్ద తేవద్దని మీ ఇద్దరిని ప్రార్థిస్తున్నాను''.

అప్రయత్నంగా ఆమె కళ్లు కన్నీటి సంద్రాలయ్యాయి. చీర కొంగుతో కళ్లు ఒత్తుకుంది. తల తిప్పుకొన్న భర్త కళ్లు ఒత్తుకోవడం ఆమె కంటపడలేదు.

ఇద్దరూ కాస్త తేరుకుని చూస్తే జాయపుడు అక్కడ లేడు.

వారిద్దరికీ స్పష్టంగా అర్థమైంది. జాయపుణ్ని మరెప్పుడూ.. 'పెళ్లి చేసుకో!' అని అడగడం కుదరదు!!

**(సశేషం)**